ప్రజాశక్తి
గురువారం 17 నవంబర్ 2022
5
పార్వతీపురం మన్యం

విధుల్లో అలసత్వం వద్దు

ప్రజాశక్తి-భామిని

సేల్స్‌మేన్‌గా విధులు సక్రమంగా నిర్వర్తించి, ప్రజలకు సకాలంలో ఉచిత బియ్యం, ఇతర సరుకులు పంపిణీ చేయాలని జిసిసి డిఎం సంధ్యారాణి.. ఘనసరా గ్రామ జిసిసి సేల్స్‌మేన్ దుర్గారావును ఆదేశించారు. ఘనసరాలోని జిసిసి గోడౌన్‌ను బుధవారం డిఎం పరిశీలించారు. గోడౌన్‌లో ఉన్న బియ్యం నిల్వలు, ఇతర జిసిసి సరుకులు, రికార్డులను పరిశీలించారు. జిసిసి గోడౌన్ తాళాలు ఒక ప్రయివేట్ వ్యక్తి చేతిలో ఉండటం ఏమిటని ప్రశ్నించారు. జిసిసి సరుకులు పోతే ఎవరు బాధ్యత వహిస్తారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సమయ పాలన పాటిస్తూ సరుకులు అందజేయాలన్నారు. సేల్స్‌మేన్ విధుల్లో వున్నప్పుడు గొడవ చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిసిసి మేనేజర్ అమోష్ పాల్గొన్నారు.

ఆరుగాలం శ్రమించి చెరకు సాగు చేసిన రైతులకు తీపి బదులు చేదే మిగులుతోంది. చెరకు పంటకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన మద్దతు ధర ప్రకటించకపోవడం పట్ల రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. మరోవైపు ఉమ్మడి విజయనగరం జిల్లాలోని ఎన్‌సిఎస్ సుగర్ ఫ్యాక్టరీ, భీమసింగి సుగర్ ఫ్యాక్టరీలు మూతపడడంతో వీటి పరిధిలోని రైతులు సంకిలి పారిస్ ఫ్యాక్టరీకి చెరకు తరలించాలని అధికారులు నిర్ణయించడంతో ఈ ఏడాది కూడా తిప్పలు తప్పవని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలోనే గురువారం సంకిలి ఫ్యాక్టరీలో క్రషింగ్ ప్రారంభం కానుంది.

చెరకు రైతులకు చేదే..

- విత్తు నాటిన నుంచి సరఫరా చేసేవరకు కష్టాలే
- రైతులకు గుదిబండగా రవాణా ఛార్జీలు
- నేటి నుంచి సంకిలి కర్మాగారంలో క్రషింగ్ ప్రారంభం

ప్రజాశక్తి-రేగిడి

జిల్లాలో సంకిలి, లచ్చయ్యపేటలోని ఎన్‌సిఎస్ సుగర్స్, భీమసింగి చక్కెర కర్మాగారం పరిధిలో ఈ ఏడాది లక్షా 43, 644 ఎకరాల్లో 10, 484 మంది రైతులు చెరకు సాగు చేశారు. 5,53,103 టన్నుల చెరకు దిగుబడి వస్తుందని అంచనా. ఉమ్మడి జిల్లాలోని ప్రధానమైన భీమసింగి సహకార కర్మాగారం, లచ్చయ్యపేట ఎన్‌సిఎస్ సుగర్ ఫ్యాక్టరీ మూతపడడంతో రైతులంతా తమకు చెరకు సంకిలి తరలించాల్సి ఉంది. అయితే రైతులకు రవాణా, అదనపు ఛార్జీలు గుదిబండగా మారనున్నాయి.

భీమసింగి, ఎన్‌సిఎస్ సుగర్ ఫ్యాక్టరీల పరిధిలో పది తూనిక కేంద్రాలు ఏర్పాటు చేశారు. గతంలో ఈ రెండు కర్మాగారాల పరిధి 35 కిలోమీటర్ల లోపు ఉండడంతో ఛార్జీలను ఆయా ఫ్యాక్టరీలే భరించేవి. అయితే రెండేళ్లుగా సంకిలికి తరలించాల్సి రావడంతో రవాణాఛార్జీలు రైతులకు భారంగా మారుతున్నాయి. మరోవైపు యాజమాన్యం మద్దతు ధర పూర్తిస్థాయిలో ప్రకటించకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. విత్తనం నాటిన నుంచి ఏడాది పొడుగునా పండించిన చెరకు కర్మగారానికి సరఫరా చేసే అంతవరకు పెట్టుబడులు ఎకరానికి రూ40వేలు నుంచి రూ.50వేలు వరకు ఖర్చవుతోంది. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టినా కూలీలు దొరక్క నానా అవస్థలు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం చెరకుటన్ను

సుగర్ ఫ్యాక్టరీ	విస్తీర్ణం (ఎకరాల్లో)	దిగుబడి (టన్నుల్లో)	రైతులు
ఎన్‌సిఎస్	5,830	1.20లక్షలు	3600
భీమసింగి	814	20,103	434
సంకిలి	1.37లక్షలు	4.13లక్షలు	6,450

మద్దతు ధర రూ.3,050 రూపాయలకు ప్రకటించినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం రూ.2,700కు తగ్గించి ప్రకటించింది. సంకిలి యాజమాన్యం టన్ను చెరకు మద్దతు ధర ఈ ఏడాది 2,980 రూపాయలు ప్రకటించడంతో కూలీల ఖర్చులకే రావడం లేదని ఆవేదం చెందుతున్నారు. పెట్టుబడులు భారీగా పెరిగిన నేపథ్యంలో సరైన మద్దతు ధర ప్రకటించకపోవడం అన్యాయమని అంటున్నారు.

సకాలంలో ఇవ్వని కటింగ్ అనుమతులు

కర్మాగారానికి చెరకును తరలించేందుకు సకాలంలో కటింగ్ ఆర్డర్లు ఇవ్వకపోవడంతో ఏటా ఇబ్బందులు పడుతున్నామని రైతులు అంటున్నారు. ఆయా ఫ్యాక్టరీల పరిధిలో సిబ్బంది కటింగ్ ఆర్డర్లు ఇవ్వకపోవడం ఒకటైతే, చెరకు కట్ చేసి కర్మాగారానికి సకాలంలో తరలించక పోవడంతో ఎండకు ఎండిపోయి బరువు తగ్గిపోయి నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది.

గిట్టుబాటు ధర లేక అప్పుల పాలు

చెరకు సాగు చేస్తే గిట్టుబాటు ధర లేక అప్పుల పాలవుతున్నాం. చెరకు సాగు ప్రారంభం నుంచి అన్నింటికీ పెట్టుబడులు పెరిగాయి. కూలి, ఎరువుల ధరలు విపరీతంగా పెరిగాయి. ఏడాది పాటు చెరుకు పంటలు పండిస్తే మదుపులకే రావడం లేదు. దీంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాం.

- బాన్న హరినాథ్,
చెరకు రైతు, సంకిలి

మద్దతుధర రూ.3500 ప్రకటించాలి

ఏటా పెరుగుతున్న పెట్టుబడులను దృష్టిలో పెట్టుకొని చెరకు రైతులకు టన్ను చెరకు మద్దతు ధర 3,500 రూపాయలు ఇవ్వాలి. యాజమాన్యం కూడా దిగుబడులను దృష్టిలో పెట్టుకొని రాయితీలు ప్రకటించడం విడ్డూరం. యాజమాన్యం రైతులు ఆదుకోవాలి.

- బూసి అనంతరావు,
చెరుకు రైతు, ఖండ్యాం గ్రామం

రైతులను ఆదుకుంటాం

చెరకు రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఏడాది చెరకుటన్ను మద్దతు ధర పెంచుతున్నాం. చెరకు రైతులు సాగు విస్తీర్ణం పెంచేందుకు భారీ రాయితీలు ప్రకటిస్తున్నాం. దిగుబడులు పెంచేందుకు శాస్త్రవేత్తలతో అవగాహన కల్పిస్తున్నాం. దిగుబడులు వస్తే రైతుకు ఆర్థికంగా కష్టాల నుంచి బయటపడతారు. ఎటువంటి సమస్యలు ఎదురైనా సిడిఒలకు నేరుగా కర్మాగారానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చు. చెరకు సరఫరాకు అన్ని విధాలుగా ఏర్పాట్లు చేశాం.

- ఎ.నాగేశేషారెడ్డి,
ప్యారీ షుగర్స్ ఉపాధ్యక్షులు, సంకిలి

రాష్ట్ర సదస్సు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

విద్యారంగ సమస్యలపై 20న రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

విద్యారంగ సమస్యలపై ఈ నెల 20న పాడేరులో యుటిఎఫ్ ఆధ్వర్యాన రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు తోట రమేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం గుమ్మలక్ష్మీపురంలో సదస్సు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ విద్య రోజురోజుకు నిర్వీర్యం అవుతుందన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలను ప్రోత్సహించే ఉద్దేశంతో గిరిజన గ్రామాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించడం లేదన్నారు. సమీపంలోని పాఠశాలల్లో విలీనం చేయడంతో గిరిజన విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని చెప్పారు. ఆశ్రమ పాఠశాలల వసతిగృహాల్లో విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందడం లేదని తెలిపారు. జిఒ 3ను పునరుద్ధరించాలని, జిఒ 1 ప్రకారం డివైఇఒ, డిఇఒ పోస్టులను గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు కేటాయించి ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాలని, ఏజెన్సీలో ఉన్న ఎంఇఒ పోస్టులను ట్రైబల్ వెల్ఫేర్ టీచర్లకు కేటాయించాలని డిమాండ్‌చేశారు. ఐటిడిఎ పాఠశాలల్లో పనిచేస్తున్న సిఆర్‌టిలను రెన్యువల్ చేయాలని, గిరిజన మాతృభాష వాలంటీర్లను రెన్యువల్ చేయాలని కోరారు. ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎం పోస్టులు భర్తీ చేయాలన్నారు. విద్యార్థులకు మెనూ ఛార్జీలు పెంచాలని, కాస్మోటిక్ బడ్జెట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై నిర్వహించే సదస్సుకు పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్న యుటిఎఫ్ నాయకులందరూ హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం మండల ప్రధాన కార్యదర్శి పత్తిక ప్రసాదరావు, ఉపాధ్యక్షులు మూటక చలపతిరావు, కురుపాం మండల ఉపాధ్యక్షులు రవికుమార్, జిల్లా కౌన్సిలర్ పత్తిక శంకరరావు పాల్గొన్నారు.

బిత్రపాడులో గజరాజులు

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

మండలంలోని బిత్రపాడు గ్రామంలో గజరాజులు తిష్టవేశాయి. దీంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరు ఏనుగుల గుంపు బుధవారం ఆ గ్రామ సమీపంలో సంచరిస్తోంది. ప్రస్తుతం వరిపంట కోతకు వచ్చిన సమయంలో ఏనుగుల గుంపు పొలాల్లో సంచరించడంతో పంటంతా నాశనం అవుతోంది. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పండించిన పంట ఏనుగుల రాకతో నేలపాలవుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొలం పనులకు సైతం వెళ్లేందుకు రైతులు భయాందోళన చెందుతున్నారు.

పొలాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు



విద్యార్థులతో మాట్లాడుతున్న మహిళా కమిషన్ సభ్యులు ఉమ

బాలల హక్కులపై అవగాహన పెరగాలి

పాఠశాలను తనిఖీ చేసిన మహిళా కమిషన్ సభ్యులు ఉమ

ప్రజాశక్తి-సాలూరు

బాలలు, మహిళలు చట్టాలు, హక్కులపై అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెద్దం ఉమ కోరారు. బుధవారం పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థినులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థి దశలో సమస్యలపై ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలని కోరారు. ఎవరి నుంచైనా లైంగిక వేధింపులు ఎదురైతే నిర్భయంగా తనకు గాని, ఉన్నతాధికారులకు గాని చెప్పాలని సూచించారు. మెనూ అమలులో, మౌలిక సదుపాయాల కల్పనలో సమస్యలుంటే చెప్పాలని కోరారు. బాలికలను తక్కువ చేసి చూడడం తల్లిదండ్రులే మానుకోవాలన్నారు. బాలికల విద్య కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని చెప్పారు. సంక్షేమ పథకాల అమలులో లోపాలుంటే ఎత్తిచూపాలని కోరారు. తర్వాత ఆమె బాలికల వద్దకు వెళ్ళి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ బ్రహ్మాజీరావు, డిసిపిఒ ఎస్‌వి రమణ, ఎంఇఒ మల్లేశ్వర రావు, ఐసిడిఎస్ పీడీ జి.వరహాలు, రూరల్, అర్బన్ ఐసిడిఎస్ పిఒలు సుగుణ, బి.సత్యవతి, ప్రిన్సిపల్ ఎం.పెంటయ్య పాల్గొన్నారు.

తప్పుదోవ పట్టించిన వారిపై చర్యల్లేవా?

గిరిజన బాలికల పట్ల లైంగిక వేధింపులకు సంబంధించిన అంశం పార్వతీపురం మన్యం జిల్లాలో సంచలనం సృష్టించింది. ఆర్‌డిఒ నేతృత్వంలోని కమిటీ నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి, నివేదికను కలెక్టర్‌కు అందజేసింది. దీంతో కలెక్టర్ వెంటనే చర్యలకు ఉపక్రమించారు. ఈ ఘటనలో హెచ్‌ఎం కృష్ణారావుపై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. కానీ ఈ ఘటనలో తొలుత దర్యాప్తు చేపట్టి, జిల్లా అధికారులకు తప్పుడు నివేదిక అందజేసిన సహాయ గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్ తెరపైకి వస్తోంది.

- వాస్తవ విరుద్ధంగా తొలి విచారణ నివేదిక!
- ఎటిడబ్ల్యుఒని సస్పెండ్ చేయాలంటున్న గిరిజన సంఘాలు

విద్యార్థినులను విచారిస్తున్న ఎటిడబ్ల్యుఒ శ్రీనివాసరావు (ఫైల్)

ప్రజాశక్తి-సాలూరు

మండలంలోని కురుకుట్టి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు తాము ఎదుర్కొన్న లైంగిక వేధింపుల విషయాన్ని ఎస్ఎఫ్ఐ నాయకుల దృష్టికి తీసుకెళ్లడంతో అది మీడియా ద్వారా వెలుగులోకి వచ్చింది. దీంతో వెంటనే జిల్లా అధికారులు స్పందించి విచారణాధికారిగా సహాయ గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావును నియమించారు. బాలికల పట్ల హెచ్‌ఎం కృష్ణారావు అసభ్యకరంగా ప్రవర్తించిన వైనంపై సహాయ గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు సెప్టెంబర్ 17న విచారణ చేపట్టారు. అయితే ఆయన జిల్లా అధికారులకు అందజేసిన విచారణ నివేదిక వాస్తవానికి విరుద్ధంగా ఉండడంతో హెచ్‌ఎం కృష్ణారావుపై చర్యలు తీసుకోలేదని స్పష్టమవుతోంది. విచారణ నివేదిక బాలికలు చెప్పినదానికి భిన్నంగా ఉన్న కారణంగానే ఏ విధమైన చర్యలూ తీసుకోలేదని జిల్లా అధికారులు గిరిజన సంఘాలతో చెప్పారు. దీంతో గిరిజన సంఘాలు మళ్లీ జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదుచేశాయి. పునర్విచారణ చేపట్టాలని డిమాండ్ చేశాయి. అడిగిందే తడవుగా జిల్లా అధికారులు రెండోసారి విచారణకు ఆదేశించారు. మహిళా అధికారులతో విచారణ జరిపించాలని సంఘాలు కోరడంతో ఆర్‌డిఒ హేమలత నేతృత్వంలో మహిళా అధికారులతో విచారణ చేపడతామని హామీ ఇచ్చారు. ఈ నెల 5న ఆర్‌డిఒ హేమలత, ఐసిడిఎస్ పీడీ వరహాలు, డివిఇఒ మంజువీణ సుదీర్ఘ విచారణ చేపట్టారు. బాలికలు గతంలో ఎస్ఎఫ్ఐ నాయకులకు ఫిర్యాదు చేసిన విధంగానే విచారణ కమిటీ సభ్యులకు ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో కమిటీ సభ్యులు యథాతథంగా నివేదికలో పొందుపరచడంతో కలెక్టర్ నిశాంత్ కుమార్ చర్యలకు ఉపక్రమించారు. సోమవారం గిరిజన సంఘాలు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేసి వినతి పత్రం అందజేశాయి. అదే సమయంలో కలెక్టర్ నిశాంత్ కుమార్ హెచ్‌ఎం కృష్ణారావుపై పోక్సో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ వ్యవహారం ఇంతవరకు రావడానికి ప్రధాన కారణం తొలిసారి విచారణ నివేదిక వాస్తవానికి విరుద్ధంగా ఉండడమేనని రుజువైంది. గిరిజనుడైన సహాయ గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు ఈ వ్యవహారంలో వాస్తవాలు తొక్కిపెట్టడానికి ప్రయత్నించారనే విషయం వెల్లడైంది. ఈ నేపథ్యంలో గిరిజన సంఘాలు ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షులు పాలక రంజిత్ కుమార్ ఆధ్వర్యాన దీనిపై ఆందోళనకు సిద్ధమవుతున్నాయి. జిల్లా అధికారులను తప్పుదోవ పట్టించే విధంగా విచారణ నివేదిక అందజేసిన సహాయ గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావును సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

18న చినమేరంగిలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

మండలంలోని చినమేరంగి గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఈ నెల 18న జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, పాలిటెక్నిక్, బిటెక్ చదువుకున్న విద్యార్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చు. సాలూరు, విశాఖపట్నం, చెన్నై, తిరుపతి, విజయవాడ, తుని వంటి పట్టణాల్లో వివిధ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీ నిమిత్తం జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు కోరారు.

మరో యాత్రికుడు మృతి

సాలూరు చేరుకున్న బొన్నాడ మృతదేహం

ప్రజాశక్తి-సాలూరు

తమిళనాడులోని అరుణాచలం తీర్థయాత్రకు వెళుతూ రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన మరో వ్యక్తి బుధవారం మృతి చెందారు. పట్టణానికి చెందిన వ్యాపారవేత్త సుతాపల్లి రాము కుమారుడు రాజేష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. దీంతో ఈ ప్రమాదంలో మృతిచెందిన వారి సంఖ్య రెండుకు చేరింది. మరో ముగ్గురు చికిత్స పొందుతున్నారు. ప్రమాదం జరిగిన రోజే మృతి చెందిన పారమ్మకొండ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ బొన్నాడ శ్రీనివాసరావు మృతదేహం బుధవారం సాయంత్రం పట్టణానికి చేరింది. ఆయన మృతితో వెలంపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. పట్టణ ప్రధాన రహదారి మీదుగా బొన్నాడ శ్రీనివాసరావు అంతిమ యాత్ర కొనసాగింది. బంధువులు, మిత్రుల అశ్రునయనాల మధ్య ఆయన అంత్యక్రియలు పూర్తయ్యాయి.



ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్‌విడి రమణ

రూ.లక్షలు ఖర్చుచేసినా సమస్యలే

డిఇఒ రమణ అసహనం

ప్రజాశక్తి-వీరఘట్టం

పాఠశాలల్లో నాడు- నేడు కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులు చేపట్టినప్పటికీ సమస్యలు దర్శనమిస్తున్నాయని డిఇఒ ఎస్‌డివి రమణ అసహనం వ్యక్తంచేశారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు-నేడు భాగంగా మొదటి విడత పాఠశాల అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, రెండో విడత పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. మూడో విడత పనులు చేపట్టేందుకు బ్యాంకు ఖాతాలు ప్రారంభించేందుకు ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక బాధ్యత వహించాలని ఆదేశించారు. పాఠశాలలో మరమ్మతులు ఉంటే వాటికి అంచనా తయారు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. బడిబయట ఉన్న పిల్లలను గుర్తించాలన్నారు. విద్యార్థులకు అమ్మఒడి, భోజనం, పుస్తకాల, బ్యాగులు వంటివి అందిస్తున్నా విద్యార్థులు, తల్లిదండ్రులు బయోమెట్రిక్ పూర్తికాలేదని, దీనిపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. పాఠ్యపుస్తకాలు వచ్చి వాటిని పంపిణీ చేసినా తమ దృష్టికి ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ పి.కృష్ణమూర్తి, హెచ్‌ఎంలు ఉప్పాడ అప్పారావు, నాగమణి, కెపి నాగమణి, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వే వేగవంతం

సబ్ కలెక్టర్ నూర్ ఉల్ కమర్

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలో చేపడుతున్న సమగ్ర భూసర్వేను వేగవంతం చేయాలని సబ్‌కలెక్టర్ నూర్ ఉల్ కమర్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండలంలోని ఎం.రాజపురం, నడిమికెళ్ల, గడగమ్మ గ్రామాల్లో ఆయన పర్యటించి, సమగ్ర సర్వేని పరిశీలించారు. కొలతల్లో తేడా లేకుండా చూడాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో పాఠశాలలు మధ్యాహ్న భోజనం, సచివాలయాలు సందర్శించి, రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దారు జల్లేపల్లి మాధవి, ఎంఆర్‌ఐలు జి.ప్రసాదరావు, కె.కృష్ణారావు , మండల సర్వేయర్ ఆర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నడిమికెళ్ల పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

గ్రామస్తులను విచారిస్తున్న ఆర్ఐ సునీత

నంద విఆర్‌ఒపై దర్యాప్తు

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని ఎస్.పెద్దవలస సచివాలయ పరిధిలోని నంద విఆర్ఒ గిరిజనుల నుంచి పట్టాదారు పాసుపుస్తకాల కోసం వసూళ్లకు పాల్పడుతున్నారని వచ్చిన కథనంపై బుధవారం అధికారులు విచారణ చేపట్టారు. ఆర్ఐ సునీత.. నంద గ్రామంలో గిరిజనులు బిడ్డిక అప్పలస్వామి, బి.రామకృష్ణ నుండి లిఖిత పూర్వకంగా వాంగ్మూలం తీసుకున్నారు. పాసు పుస్తకం కోసం రూ.4500 ఒప్పందం కుదుర్చుకున్నారని, తొలుత రూ.2 వేలు విఆర్‌ఒకు ఇచ్చామని అప్పలస్వామి తెలిపారు. బి.రామకృష్ణ 90 సెంట్లు భూమి కోసం రూ.1500 ఇచ్చామని చెప్పారు. నెలలు గడుస్తున్నా కనీసం ఆన్‌లైన్లో కూడా పేర్లు లేకపోవడంతో విలేకరులకు సమాచారాన్ని ఇచ్చామని వెల్లడించారు. స్థానిక విఆర్ఒ ఆదిలక్ష్మిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో చాలామంది నుండి వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపించారు. ఈ విషయమై తహశీల్దారు సూర్యనారాయణను విలేకరులు ప్రశ్నించగా, నివేదికను ఆర్‌డిఒకు అందిస్తామని తెలిపారు.

తనిఖీలు చేపడుతున్న అధికారులు

ప్లాస్టిక్ వినియోగంపై తనిఖీలు

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

పట్టణంలో ప్రధాన రహదారిలో ప్రజారోగ్య అధికారి సి హెచ్.మురళి పర్యవేక్షణలో బుధవారం ప్లాస్టిక్ వినియోగంపై తనిఖీలు చేపట్టారు. పలు దుకాణాలలో ప్లాస్టిక్ సంచులు వాడడం గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఆయా వ్యాపారుల వద్ద నుండి అపరాధ రుసుం వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబరు ఒకటో తేది నుంచి పట్టణంలో ప్లాస్టిక్‌ను నిషేధించినా వినయోగించడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు.

త్రిచక్ర వాహనాలకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-కలెక్టరేట్

జిల్లాలో విభిన్న ప్రతిభావంతులు మూడు చక్రాల మోటారు వాహనం పొందుటకు ఈ నెల 19వ తేదీ లోగా దరఖాస్తు సమర్పించాలని ఆ శాఖ ఎడి ఎం.కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో వివరాలు సమర్పించిన అభ్యర్థులు వాటి నకలు కాపీలను ధ్రువపత్రాలు జతచేసి, కలెక్టరేట్ స్పందనలో 19న సమర్పించాలని పేర్కొన్నారు. వివరాలకు కోసం ఎడి కార్యాలయ ఫోన్ నంబర్ 08942-240519ను సంప్రదించాలని సూచించారు.

19న పాలకొండలో జగనన్న క్రీడా సంబరాలు

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

పాలకొండలో ఈ నెల 19న జగనన్న క్రీడా సంబరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్ర ప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్ (స్త్రీ, పురుషులు), క్రికెట్ (పురుషులకు) క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 19న పాలకొండ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నియోజకవర్గ స్థాయి ఎంపికలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, సబ్‌కలెక్టర్ నూర్ ఉల్ కమర్ పాల్గొంటారని చెప్పారు. వివరాలకు 99086 89050 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సమావేశానికి హాజరైన తోటపల్లి దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యులు

తోటపల్లి దేవస్థాన అభివృద్ధి కమిటీ సమావేశం

ప్రజాశక్తి - కురుపాం

తోటపల్లి దేవస్థానం అభివృద్ధి కమిటీ ప్రత్యేక సమావేశాన్ని మేనేజింగ్ డైరెక్టర్ ద్వారపురెడ్డి ధనుంజయ్‌రావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు నిర్ణయాలు తీసుకున్నారుక. వచ్చే రెండు మూడు రోజుల్లో 50 మంది అనువంశిక ధర్మకర్తలను చేర్చి 200 మంది పూర్తి చేయాలని, రూ.20 లక్షలు శాశ్వత నిధి ఏర్పాటు చేయడానికి, దీనిపై వచ్చే వడ్డీ సంస్థ నిర్వహణ కోసం ఉపయోగించాలని తీర్మానించారు. పార్వతీపురం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ డి.శ్రీదేవి, సోషల్ వర్కర్ పి.రామలక్ష్మి మాట్లాడుతూ మహిళలు ఎక్కువ మంది చేరే విధంగా కృషి చేయాలన్నారు.

సకల సౌకర్యాలతో జగనన్న కాలనీలు

ప్రజాశక్తి- బొబ్బిలి

జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణం దగ్గర నుంచి పేద ప్రజల జీవనశైలికి కావలసిన అన్ని సకల సౌకర్యాలు ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. బుధవారం పట్టణానికి సమీపంలో ఉన్న జగనన్న కాలనీలు, టిడ్కో గృహ సముదాయాలను మున్సిపల్ కమిషనర్, గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా ఎలక్ట్రికల్ ట్రాన్సఫార్మర్లు దొంగతనానికి గురికావడంతో లేఅవుట్‌లో ఉన్న బోర్లు పనిచేయక ఇబ్బంది ఉందని ఎమ్మెల్యే శంబంగికి తెలియజేశారు. ఇలాంటి పనులు చేస్తున్న వారిపై తగు చర్యలు తీసుకునేలా పోలీస్ సిబ్బందితో మాట్లాడి దర్యాప్తు జరిపించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ శ్రీనివాసరావుకు సూచించారు. జగనన్న కాలనీలో ఇల్లు నిర్మాణంతో పాటు రోడ్లు, డ్రైనేజీలు త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జనసేన నాయకులు ఉపయోగించే అసభ్య పదజాలంతో ఓటు బ్యాంకింగ్ పెరగదని అలాంటి మాటలు తమ ఉనికిని కాపాడుకోవడానికి తప్ప ఎలాంటి రాజకీయ ప్రయోజనం చేకూరదని విమర్శించారు. టిడ్కో ఇళ్లను కూడా మార్చి నెలలో లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని బూర్జ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని బుధవారం ఎంపిడిఒ బి.కృష్ణ మహేష్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న మెనూ కచ్చితంగా అమలు చేయాలన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని చెప్పారు. పాఠశాలలో ఉపాధ్యాయుల రికార్డులను పరిశీలించారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఎఒ ఎంఎస్ఎన్‌వి ప్రసాద్, ఇఒ పిఆర్‌డి కెకె వర్మ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కామన్నదొరవలసలో స్ప్రేయింగ్

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని కామన్నదొరవలసలో దోమల నివారణకు సర్పంచ్ బుడిది శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం స్ప్రేయింగ్ చేపట్టారు. మాజీ సర్పంచ్ బుడితి గౌరనాయుడు, పిహెచ్‌సి ఇఒ జి.సూర్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి జె.వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా స్వమిత్వ సర్వే

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

స్వమిత్వ సర్వే సక్రమంగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి పి.కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఆరు గ్రామాలు ఈ సర్వేకు ఎంపిక చేసినట్టు చెప్పారు. బాధ్యతగా వ్యవహరించి సర్వే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేశాఖ ఎడి రాజ్‌కుమార్, ఎంపిడిఒ డొంక త్రినాధులు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ రామకృష్ణ, డిఎల్‌పిఒ రాంప్రసాద్ తదితరులున్నారు.

కోటదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.4.21 లక్షలు

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణంలో కోటదుర్గమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.4,21,161 వచ్చింది. బుధవారం ఆలయంలో ఇఒ వి.రాధాకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్‌శర్మ, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.రామారావు పర్యవేక్షణలో హుండీ లెక్కించారు. గత నెల 10వ తేదీ నుంచి ఈ నెల 16వ తేదీ వరకు వచ్చిన ఆదాయంగా ఇఒ తెలిపారు.

విజ్ఞాన నిలయాలు.. గ్రంథాలయాలు

ప్రజాశక్తి-సాలూరు

అన్ని వయస్కులైన వారికి విజ్ఞానం పంచే నిలయాలు గ్రంథాలయాలని సాలూరు సాహితీ మిత్ర బృందం వ్యవస్థాపక అధ్యక్షులు జెవి తిరుమలాచార్యులు అన్నారు. బుధవారం పట్టణంలోని గ్రంథాలయంలో లైబ్రేరియన్ రాధాదేవి ఆధ్వర్యాన వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యమకారులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు, వావిలాల గోపాలకృష్ణయ్య, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ గ్రంథాలయానికి సొంత భవన నిర్మాణానికి పట్టణ ప్రముఖులు కృషి చేయాలని కోరారు. ప్రస్తుత పోటీ యుగంలో నిరుద్యోగులకు, విద్యార్థులకు పోటీ పరీక్షలకు కావలసిన విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు చాలా అవసరమని చెప్పారు. అనేక సంవత్సరాలుగా అద్దె భవనంలో ఉన్నప్పటికీ గ్రంథాలయ నిర్వహణలో, పాఠకులకు సౌకర్యాల కల్పనలో లైబ్రేరియన్ రాధాదేవి కృషిని ప్రశంసించారు. అనంతరం తిరుమలాచార్యులును లైబ్రేరియన్ రాధాదేవి, పాఠకులు సన్మానించారు.

వీరఘట్టం : స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ నాయకులు

సాలూరు.. గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న తిరుమలాచార్యులు

ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు లైబ్రేరియన్ ఎం.వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

సీతంపేట : స్థానిక గ్రంథాలయంలో ఎస్.ఆర్.రంగనాథన్, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు తహశీల్దార్ నర్సింహమూర్తి పూలమాల వేసి నివాళు అర్పించారు. గ్రంథాలయ ఉద్యమ నాయకులు చేసిన కృషిని ఆయన కొనియాడారు. గ్రంథాలయ అధికారి బి.గణేష్‌బాబు, ఆర్ఐ రమేష్, సహాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.

భామిని : స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ సునీత ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు బాలయోగి గురుకులం ప్రిన్సిపల్ విజయనిర్మల, కెజిబివి ఎస్ఒ బి.శారద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపల్ రంగారావు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురం గ్రంథాలయంలో బుధవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు వచ్చి పుస్తక పఠనం చేశారు. గ్రంథాలయ అధికారి డి.సుకన్య ఆధ్వర్యాన విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

పాలకొండ రూరల్ : గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు మన్యం జిల్లా ఉద్యోగుల సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి నూతలపాటి భరత్ భూషణ్ పులమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో 13వ వార్డ్ కౌన్సిలర్ బాసూరు కాంతారావు, యామల ఈశ్వరరావు, అంపిలి శంకరరావు, గ్రంథాలయ ఇన్‌ఛార్జి అధికారి బబ్బురు గణేష్‌బాబు, సహాయకులు ఈశ్వర్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

భామిని.. మాట్లాడుతున్న హౌసింగ్ ఇఇ రమేష్

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలో నూతనంగా మంజూరైన జగనన్న ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి అయ్యేలా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కృషి చేయాలని హౌసింగ్ డిఇ మోహన్‌రావు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం సర్పంచులు, ఎంపిటిసిలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. మండలంలో 816 జగనన్న గృహాలు మంజూరైనట్లు చెప్పారు. వీటిలో 693 రిజిస్ట్రేషన్ అయ్యాయని అన్నారు. ప్రతీ లబ్ధిదారుడు ఇంటిని పూర్తి చేసేలా ప్రజా ప్రతినిధులు కృషి చేయాలన్నారు. ఇంటి నిర్మాణానికి ఇసుక, సిమెంటు, ఐరన్ ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. ఇప్పటికే ప్రారంభించని ఇళ్లను సిబ్బంది ప్రారంభించి పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ జి.జగదీష్ కుమార్, వైస్ ఎంపిపిలు ఎన్.శేఖర్, లక్ష్మణరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ జి.గిరిబాబు, హౌసింగ్ ఎఇ రెడ్డి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్ : గ్రామాల్లో గృహనిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపిడిఒ డొంక త్రినాథులు అన్నారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు జరిగేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. బిల్లులు కూడా సకాలంలో చెల్లించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ మాధవరావు ఉన్నారు.

సుడా ద్వారా అర్హులందరికీ ఇళ్లు

భామిని : శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా మండలంలో అర్హత కలిగిన వారికి ఇళ్లు మంజూరు అవుతాయని హౌసింగ్ ఇఇ టి.రమేష్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలంలో 760 ఇళ్లు మంజూరు అయ్యాయని, ఆయన చెప్పారు. 415 ఇళ్లకు రూ.5 వేలు చొప్పున ముందస్తుగా చెల్లించామని, వీటిలో 352 మంది ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారని చెప్పారు. ఇళ్ల పనులు ప్రారంభించేలా ఈ నెల 19న సర్పంచులకు అవగాహన కలిగించాలని తెలిపారు. కార్యక్రమంలో తోట సింహాచలం, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, కొవ్వాడ చిరంజీవులు, ఎంపిడిఒ జి.కృష్ణారావు, ఎ.రఘుపతి నాయుడు, హౌసింగ్ ఎఇ సిహెచ్ వెంకటేష్ పాల్గొన్నారు.

వైద్య సిబ్బందిని నియమించాలి

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించాలని టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి టి.జగదీశ్వరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిహెచ్‌సిని బుధవారం ఆమె సందర్శించారు. చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి, సమస్యలను, అందుతున్న సేవలను తెలుసుకున్నారు. అనంతరం రోగులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. ఏయే వ్యాధులు ఎక్కువగా నమోదవుతున్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగులకు పౌష్టికాహారం అందించాలని కోరారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సిహెచ్‌సిలో వైద్యుల కొరత ఎక్కువగా ఉందన్నారు. ఆసుపత్రిలో అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉంచి గిరిజనులకు సేవలు అందించాలని కోరారు. ముఖ్యంగా గైనిక్ పోస్ట్ భర్తీ చేయవలసిన అవసరం ఉందన్నారు. వందలాది మంది రోగులు వస్తున్న ఆసుపత్రిలో నేటి వరకు

రోగులకు రొట్టెలు పంపిణీ చేస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

సిబ్బంది లేకపోవడం విచారకరమన్నారు. తోటీలను నియమించి పోస్టుమార్టం స్థానికంగా నిర్వహించాలని కోరారు.

ప్రజల నమ్మకంతోనే సహకార బ్యాంకుల అభివృద్ధి

సహకార జెండాను ఎగురవేస్తున్న కస్తూరి రామకృష్ణ

ప్రజాశక్తి-సాలూరు

ఖాతాదారుల నమ్మకాన్ని పరిరక్షించినప్పుడే పట్టణ సహకార బ్యాంకులు అభివృద్ధి చెందుతాయని జిల్లా సహకార ఆడిట్ అధికారి ఎవి రమణమూర్తి చెప్పారు. 69వ జాతీయ సహకార వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణ సహకార బ్యాంకులో పాలకవర్గ సభ్యులు కస్తూరి రామకృష్ణ సహకార జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అవసరమైనప్పుడు వారికి రుణాలు మంజూరు చేయాలని కోరారు. సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ బ్యాంక్ రుణాలు సద్వినియోగం చేసుకుని తిరిగి సకాలంలో చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ సహకార అధికారి ఎ.జార్జి, బ్యాంక్ సిఇఒ బి.వేణుగోపాల రావు, సబ్ డివిజనల్ సహకార అధికారి ఎన్ఎస్-ఎస్ పద్మజ పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

ప్రజాశక్తి-పాలకొండ

చక్కెర పరిశ్రమ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. పట్టణంలో మార్కెట్ కమిటీ ఆవరణలో చెరకు రైతుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరకు పండించిన రైతులకు సరైన ఆదాయం రావడం లేదన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు ఆదాయ మార్గాలు కల్పించేలా చూడాలన్నారు. చెరకు కోత యంత్రాలు మరిన్ని మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో వీరఘట్టం ఎంపిపి డి.వెంకటరమణ, వైస్ ఎంపిపి కె.సూర్యప్రకాష్, ఎం.సింగుపురం సర్పంచ్ రణస్థలం రాంబాబు, అంపిలి, అన్నవరం సర్పంచ్‌లు లోలుగు విశ్వేశ్వరరావు, గవర రాజశేఖర్, టిడిపి మండల అధ్యక్షులు గండి రామినాయుడు, చక్కెర ఫ్యాక్టరీ డిజిఎం ఎ.వి.నాగశేషరెడ్డి, ఎజిఎం రమేష్‌కుమార్ రెడ్డి ఉన్నారు.

లచ్చయ్యపేటలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని లచ్చయ్యపేట గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పిహెచ్‌సి వైద్యాధికారి ఉషారాణి, 104 డాక్టర్ వంశీబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులకు గ్రామంలో అన్ని పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందించారు. మంచానికే పరిమితమైన వారి ఇళ్లకు వెళ్లి వైద్య సేవలు అందించారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి, మందులిచ్చారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టంలో..

వీరఘట్టం : మండల కేంద్రంలోని గాజులవీధిలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా

సీతానగరం.. వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

వైద్యాధికారులు జి.ప్రదీప్ కుమార్, ఎం.దేవివరప్రసాద్ వందమందికి వైద్య తనిఖీలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శాంతికుమారి, నవోనమ్మ, ఎఎన్ఎంలు, సిహెచ్ఒ కావ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మంచి సాగుపద్ధతులతోనే మేలైన దిగుబడులు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

సరైన సాగు పద్ధతులతో అనుకున్న దిగుబడులు ఆశించవచ్చని వ్యవసాయ నిపుణులు తెలిపారు. బుధవారం పార్వతీపురం సబ్‌డివిజన్ పరిధిలో గ్రామ వ్యవసాయ సహాయకులకు ఎడి అధ్యక్షతన జిల్లా శిక్షణా కేంద్రం సహాయ సంచాలకులు ఆర్.శ్రీనివాస్, శారద, శ్రీనివాస్, డాట్ సెంటర్ శాస్త్రవేత్త తేజేశ్వర్‌రావు, ప్రకృతి వ్యవసాయ విభాగం డిపిఎం షణ్ముఖరాజు శిక్షణ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఆర్.శ్రీనివాసు మాట్లాడుతూ పొలంబడి ప్రక్రియను మొత్తం 14 వారాలలో చేసే కార్యక్రమాలను వివరించారు. పొలంబడి వల్ల రైతుకు తక్కువ ఖర్చుతో ఎక్కువ నాణ్యమైన దిగుబడి వస్తుందన్నారు. శాస్త్రవేత్త తేజేశ్వరరావు, డిపిఎం షణ్ముఖరాజు వివిఎలకు పలు సూచనలు చేశారు.

కబ్జాలపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

జగనన్న కాలనీల్లో కబ్జాలపై చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నాయకులు కోరారు. బుధవారం డిఆర్ఒ వెంకటరావును జనసేన పార్టీ నాయకులు వంగల దాలినాయుడు, బంటు శిరీష్, రాజాన రాంబాబు, సిరిపురం గౌరీ శంకర్ కలిసి, ఫిర్యాదుచేశారు. గోపాలపురం రహదారిలోని కొత్తవలస సమీపంలోని జగనన్న కాలనీ లేఅవుట్లలో ఒకరికి కేటాయించి, పట్టా ఇచ్చిన స్థలంలో వేరొకరు కబ్జా చేసి, ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పాలకొండ

అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాలు సందర్భంగా జన చేతన ఆధ్వర్యంలో బుధవారం పాలకొండలోని వివేకానంద మోడల్ స్కూల్లో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జన చేతన కార్యదర్శి బగాది శశిభూషణ చౌదరి మాట్లాడుతూ బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. పాఠశాల విద్యార్థులకు చైల్డ్ రైట్స్‌పై క్విజ్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గవర పారినాయుడు, ఉపాధ్యాయులు జి.అప్పల నాయుడు, వై.దిలీప్, ఎస్.సుందర రావు, ఫెసిలిటేటర్ ఎం.సరస్వతి పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి -భామిని

కీళ్లమార్పిడి శస్త్రచికిత్స, వైద్య ఖర్చుల నిమిత్తం చిన్నదిమిలి గ్రామానికి చెందిన పిన్నింటి రామలక్ష్మి, పెద్దదిమిలి గ్రామానికి గుడ్ల ఉమామహేశ్వరికి ఒక్కొక్కరికి రూ.85 వేలు చొప్పున సిఎం సహాయనిధి చెక్కులు మంజూరయ్యాయి. ఈ చెక్కులను ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం నాయకులు తోట సింహాచలం, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, కొవ్వాడ చిరంజీవులు.. రామలక్ష్మి, ఉమామహేశ్వరి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎ.రఘుపతి నాయుడు, పెద్దదిమిలి సర్పంచ్ టి.శ్రీను, చిన్నదిమిలి సర్పంచ్ లోతుగెడ్డ రవి, రామినాయుడు పాల్గొన్నారు.

అస్వస్థతకు గురై విఆర్ఒ మృతి

ప్రజాశక్తి - కురుపాం

సీతారాం (ఫైల్)

మండలంలో ఊసకొండ విఆర్ఒ డి.సీతారాం (47) తీవ్ర అస్వస్థతకు గురై మృతిచెందారు. తన స్వగ్రామమైన పుట్టూరులో ఇంటివద్ద బుధవారం తీవ్ర అస్వస్థతకు గురవడంతో కుటుంబ సభ్యులు పార్వతీపురంలోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మధ్యాహ్నం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. సీతారాం మృతికి తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్, విఆర్ఒలు, కార్యాలయ సిబ్బంది సంతాపం తెలిపారు.

కుష్టువ్యాధిపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-సాలూరురూరల్

మామిడిపల్లి పిహెచ్‌సి వైద్యులు రెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం పిహెచ్‌సి పరిధిలోని పలు గ్రామాల్లో కుష్టువ్యాధిపై అవగాహన ర్యాలీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్మంపై స్పర్శ లేని మచ్చలు కుష్టువ్యాధేనని చెప్పారు. ప్రతి ఇంటికీ వెళ్లి సిబ్బంది తనిఖీలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒ జి.తిరుపతిరావు, పిహెచ్ఎన్ఎం సావిత్రి, హెచ్‌వి సీత, ఎఎన్ఎం అనూష పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న టిడిపి నియోజకవర్గ పరిశీలకులు సాగర్, ఇన్‌ఛార్జి జయకృష్ణ

గిరిజన గ్రామాల్లో బాదుడే బాదుడు

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలోని గిరిజన గ్రామాల్లో బుధవారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యాన బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించారు. పులిపుట్టి పంచాయతీ పరిధిలో ముకుందాపురం, సుందరయ్యగూడ, ఎంపలగూడ, రేగులగూడ, రేగులగూడ కాలనీ, ఇప్పగూడలో పర్యటించారు. ఈ సందర్భంగా టిడిపి నియోజక వర్గ పరిశీలకులు కలమట సాగర్ మాట్లాడుతూ నిత్యావసర సరుకుల నుంచి విద్యుత్తు, ఆర్‌టిసి ఛార్జీలు పెంచి సామాన్యుడిని దోచుకుతింటున్నారని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు బిడ్డిక వెంకటరమణ మృతికి నివాళులర్పించారు. అనంతరం టిడిపి మండల నూతన అధ్యక్షులుగా సవరతోట. ముఖలింగాన్ని నియమి ంచారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షులు బిడ్డిక దమయంతి నాయుడు, ఎస్‌టి సెల్ రాష్ట్ర కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, సర్పంచ్ బిడ్డిక నీలయ్య, బిడ్డిక మన్మథరావు, గేదల కాంతారావు, సర్పంచ్ సవర బాజన్న, బిడ్డిక స్వామినాయుడు, సవర సూర్యం, నిమ్మక.కష్ణ, ఐటిడిపి కో-ఆర్డినేటర్ బిడ్డిక సోను, తిరుపతి, ఎద్దు శ్రీనివాసరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి-సాలూరు



విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ బ్రహ్మాజీరావు

పట్టణంలోని వేద సమాజం సంస్కృత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నాడు-నేడు పనులను డిప్యూటీ డిఇఒ బ్రహ్మాజీరావు పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. నాణ్యతాలోపాలు లేకుండా చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనం పంపిణీ గురించి ఆరాతీశారు. తర్వాత పదోతరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట హెచ్‌ఎం వి.ప్రభాకరరావు ఉన్నారు.